# ఉట్టిలో స్వర్గం

## ఇసుకపల్లి దక్షిణామూర్తి

అమ్మమ్మ అమ్మమ్మగా అయిననాటి నుంచి చేస్తున్న నిరంతర కృషి ఫలితమే అని చెప్పవలసి వస్తుంది ఇప్పటికైనా కాశీయాత్రకు బయలుదేరటం సంభవించిందీ అంటే: మొదటినుంచీ లేకపోయినా కనీసం చచ్చేముందయినా ఆవిడ యిష్టం వచ్చినట్లు చేయటానికి ఆస్కారం కల్పించాలని గోపాలం వుద్దేశం. కాశీలో పుట్టిన వాళ్ళకు తిరిగి జన్మ వుండదని తను అమ్మమ్మ కాక మునుపు ఒక హరిదాసు కాలక్షేపం సందర్భంలో వకమాట అన్నాడు. ఆనాటి నుంచి అదేమాట అమ్మమ్మను ఇన్సూరెన్సు ఏజెంటులా వెన్నాడుతూనే వుంది. ఎప్పుడూ అదే ఆలోచన. కాశీలో పుట్టలేదు కాబట్టి కనీసం అక్కడ చావనన్నా చస్తే మళ్లీ చావు వుండటానికి అవకాశం వుండదని అభిప్రాయపడింది. చావు లేని మనిషి పుట్టటం అసంభవం కాబట్టి తనకు జన్మ రాహిత్యం కలుగుతుందని అమ్మమ్మ నమ్మకం. అందుకనే ఇప్పుడు కాశీకి బయలుదేరింది. చచ్చేటంత వరకూ అక్కడే వుండిపోదామని నిర్ణయించు కోవటం వలన, పక్కింటి పార్వతమ్మ "ఏం పిన్నిగారూ...... మళ్ళీ ఎప్పటికొస్తారు" అనగానే "ఏం రావటమో తల్లీ... ఇంకా వకటే రావటం" అంటూ కళ్ళనీళ్ళు కొంగు కద్దుకుంది. పార్వతమ్మ లాంఛనంగా కొంగు కళ్ళ దగ్గర పెట్టుకుంది.

అమ్మమ్మ మనస్సు కొంచెం తేలికపడి మళ్ళీ "బరువు" పడింది. తను పోతున్నానంటే "అయ్యో" అనే వాళ్ళుండటం తను ఏ జన్మలో చేసుకున్న సుకృతమో! – ఈ జన్మలో సుకృతం చేసుకున్న దాని తూకం చాలా తక్కువని అమ్మమ్మకి గూడా గట్టిగా తెలుసు – తను అయినవాళ్ళందరినీ విడిచిపెట్టి, వుంటుందో వుండదో తెలియని జన్మ రాహిత్యం కోసం ఈ వున్న జన్మ రాహిత్యం చేసికోవటం ఎందుకా అని కాసేపు ఆలోచన పడి హృదయంలో బరువెక్కించుకుని "ఊ" అంటూ మూలిగింది. పక్కనే నిలబడ్డ గోపాలం "ఏం అమ్మమ్మా... మూలుగుతున్నావు?" అంటూ బిగ్గరగా అడిగి "ఏం వచ్చిందో" అంటూ యింకొంచెం మెల్లిగా గొణిగాడు. గొణిగిన మాటల వరకే విన్న అమ్మమ్మ "ఏం రాలేదు నాయనా.... బండి వచ్చిందా అని ఆలోచిస్తున్నాను" అంది చటుక్కున. గోపాలం మనస్సు చివుక్కుమంది. "అంత మెల్లిగా అన్నా వినపడిందే" అనుకున్నాడు మనస్సులోనే మళ్ళీ పైకి వినపడుతుందేమోనని భయపడుతూ.

బండి రావటం, ఎక్కటం, దిగటం, రైలు వేంచయటం, ఎక్కడం అన్ని వరసాగ్గా సవ్యంగానే జరిగాయి. ఇంజను నడిపే బాధ్యత ప్రయాణీకులకు యింకా రాలేదు కాబట్టి అమ్మమ్మ, గోపాలం నిద్రపోతున్నా బండి పోతునేవుంది. కాశీ చేరేటప్పటికి రెండు రోజులయింది. ముడి

సరుకులు తెచ్చుకున్న మూట మూడు రోజుల నుంచి ముచ్చటగానే కనపడుతోంది గాని మూడోరోజు తెల్లవారేటప్పటికి ముచ్చటగానే మాయమయి వూరుకుంది. మూట కాశీలో పోయింది కాబట్టి విశ్వేశ్వరస్వామికి చేరివుంటుందని, అట్లా చేర్చుకోమని ప్రార్థిస్తూ అమ్మమ్మ మనసారా ప్రార్థించింది. ఆ ప్రార్థనలో ఏకోశానా చెడు అభిప్రాయం లేదు. పోయిన సొమ్ము భగవంతుడి దగ్గరకు పోవాలనే అమ్మమ్మ వుద్దేశం.

కాశీలో అడుగు పెట్టినప్పటి నుంచి అమ్మమ్మకు వళ్ళు తెలియటం లేదు. ఎక్కడో స్వర్గలోకంలో విహరిస్తున్నట్లయింది. ఎక్కడ చూచినా కొబ్బరికాయలు, హారతి కర్పూరం బిళ్ళలూ విరివిగా కనబడుతున్నాయి. అదే కాశీ అంటే అనుకుంది. అవునన్నాడు గోపాలం. నిజమే ననుకుంది అమ్మమ్మ. అమ్మమ్మ కాదూ అందుకని.

కాశీ చేరిన తర్వాత చెయ్యాల్సిన పనులన్నీ ఐపోయినా అమ్మమ్మ అనుకున్నపని అట్లాగే వుండిపోయింది. అదేం కాదు జన్మ రాహిత్యం చేసికోవటం. ఎట్లాగైనా అక్కడే చనిపోవాలి. ఆ విషయం ముందుగా గోపాలానికి తెలిసిందంటే గోలకట్టేస్తాడని యింతవరకు పొక్కనియ్యలేదు. గుండె నిబ్బరం చేసుకుని "గోపాలం.... విశ్వేశ్వర దర్శనం ముందరగా చేసుకుని తరవాత గంగాస్నానం చేద్దాం" అంది మనస్సులో గంగాభవానిని స్మరణ చేసుకుంటూ. గోపాలం వుక్కిరి బిక్కిరి అయి "గంగాస్నానం కాకుండా... స్వామి దర్శనం ఎట్లాచేస్తాం అమ్మమ్మా" అన్నాడు. గంగాస్నానం చేసిన తర్వాత..... అక్కడే జన్మ రాహిత్యానికి ఏర్పాటు చేసుకుంది. గంగలో స్నానం చెయ్యటానికి మునిగిన మునకతో మళ్ళీ తేలగూడదని అమ్మమ్మ ఇంటి దగ్గరే ఖాయం చేసుకుని మరీ బయలుదేరింది. లేకపోతే కాశీలో చచ్చిపోయేదెలా... చచ్చిపోయే టప్పుడు చల్లని తల్లి గంగాభవాని వడిలోకి వెరిగిపోతే జన్మరాహిత్యంతో పాటు వక సంచీడు పుణ్యం గూడా వస్తుందని అమ్మమ్మ ఆశ. మోక్షం వస్తుందనుకున్నా కొంచెం పుణ్యం చేసుకుని స్వర్గసౌఖ్యాలు అనుభవిద్దామని అమ్మమ్మ మనస్సులోపల ఎక్కడో సన్నని కోర్కె గిలిగింతలు పెడుతోంది. అక్కడ ఇంద్రుడు, నలకూబరుడు వగైరా "మగవేశ్యలు" వుంటారు కదూ! అందుకనే ముందర విశ్వేశ్వర దర్శనం అయిపోతే తరవాత గంగలో వచ్చి పడవచ్చునని.... గోపాలం అమ్మమ్మ మాట కాదంటే జరిగే విషయాలన్నీ అదివరకే అనుభవించి వుండటం వలన అట్లాగే నంటూ తలవూపాడు.

ఆలయ ప్రాకారంలో అడుగిడగానే గణగణ గంటలు చెవుల్లో గింగుర్లెత్తుతూ వినిపించాయి. అమ్మమ్మ వళ్ళు జలదరించింది. స్వామిలో ఐక్యం అయిపోతున్నట్లనిపించింది. కొద్దిగా లోపలకు పోగానే జన సమూహం బాగా ఎక్కువయింది. అమ్మమ్మ జనంలో చొరబడి చకచకా స్వామివైపుకు నడుస్తోంది. గోపాలం వెనకనే బుజాలతో జనాన్ని నెట్టుకుంటూ నడుస్తున్నాడు. అమ్మమ్మకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. అక్కడే చచ్చిపోతే... గంగలో చచ్చిపోయినా స్వామిలో ఐక్యం కావాలంటే సూక్ష్మరూపంలో మళ్ళా యిక్కడికి రావలసిందే గదా! అప్పుడు దారి గుర్తువుంటుందో వుండదో! ఐనా అంత ఆలస్యం ఎందుకు? యివన్నీ సమగ్రంగా ఆలోచించి వున్నదున్నట్లు కింద పడిపోయింది. జనం చూడకుండా మీదుగానడిచి తొక్కితే చచ్చిపోవచ్చుగదా! అని. స్వామి దర్శనం అయిన తర్వాత అంతకంటే ఏం కావాలి... అమ్మమ్మ పడిపోవటంతోనే గోపాలం "అయ్యో" అంటూ వక గావు కేకపెట్టాడు. చుట్టూ జనం వక్కసారిగా అటూ యిటూ తప్పుకున్నారు. ముసలమ్మ

విశ్వేశ్వరుని ఆలయంలో విరుచుకుపడిపోతే యింకేముంది... గుణం పెరిగి వుంటుంది. అవునంటే అవునన్నారు. "పూజారి పైసల పళ్ళెంలోని పైసలన్నీ బొడ్డులో దోపుకుని ఖాళీ పళ్లెం విశ్వేశ్వరుని కాళ్ళ ముందు గిరాటువేసి అమ్మమ్మ వైపు పరుగెత్తుకుంటూ వచ్చాడు "స్వామీ... స్వామీ...." అంటూ కొబ్బరినీళ్ళ ఝారీ చెంబు చేత పట్టుకుని.

గోపాలం వంక అంతా అదే పనిగా చూస్తున్నారు. అయన తాలూకు ముసలమ్మకు గణం పెరుగుతే ఆయనకు గొప్పకాదూ! పూజారి కొబ్బరి నీళ్ళు గొంతుకలో వుద్ధరిణతో రెండు చుక్కలు చిలకరించి మామూలుగంగనీళ్ళు పెద్ద చెంబెడు ముఖాన కుమ్మరించాడు. అమ్మమ్మ వూరికే "వస్తున్నా...వస్తున్నా" అంటూ కేకలేస్తోంది. స్వామిలో ఐక్యం అయేవుద్దేశ పడుతోందని వాళ్ళకేం తెలుసు! "స్వామీ.... ఏం కావాలి.... ఎందుకీ ఆగ్రహం" అంటూ భక్త పరమాణువులంతా పరవళ్ళు తొక్కుతున్నారు. "వస్తున్నా" అంటూ కేకలు తప్ప యింకా ఎటువంటి సమాధానం లేకపోయేటప్పటికి వక వెకిలి వెంగళాయి గుంపులోనుంచి ముందుకు తోసుకువచ్చి "గాడిద గుడ్డు... గణం లేదు గిణం లేదు... లే ముసలమ్మా" అంటూ రెక్క పట్టుకు వక్క గుంజు గుంజాడు. అమ్మమ్మ అప్పుడే కళ్ళు తెరచి మళ్ళీ మూసుకుంది. తను స్వామిలో ఐక్యం అయిపోతుంటే చూసి ఓర్వలేని వారు తన్నెవరో పట్టుకుని భూలోకంలోకి లాగుతున్నారనిపించింది. వెంగళాయి రెండు చేతులూ పట్టుకుని లేవతీసి కూర్చోపెట్టిన తర్వాత గాని తెలివి తెల్లారలేదు. బలవంతంగా లేవతీయటం వలన మూలుగుతూ "నాయనా గోపాలం... నువ్విక్కడే వున్నావట్రా" అంటూ వుస్సురు మంది. దానితో యిది గణం పెరగటం కాదని చాలా మందికి తెలిసిపోయింది. "ఇదేదో ఫిట్సు రోగంలా వుంది.... తీసికెళ్ళి ఆసుపత్రిలో పారెయ్యి" అంటూ వక నాజూకు మనిషి సలహా చెప్పాడు. గోపాలం వాళ్ళందరికీ సమాధానం చెప్పలేక అమ్మమ్మను వెంట బెట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ ఆలయం బయట పడ్డాడు.

అమ్మమ్మ నిశ్చయం చేసుకుంది గంగలోనే తన చావు రాసిపెట్టి వుందని. అందుకని గోపాలాన్ని పోరుపెట్టి, గంగ వడ్డుకు సూటిగా ప్రయాణం కట్టింది. అడుగు గూడా జోరుగా సాగుతోంది. గంగాతీరం చేరేటప్పటికి అక్కడ మటుకు జనసమ్మర్ధం తక్కువగా వుందనా! "జనంలోపడి చావటం కంటే చల్లని తల్లి గంగలో పడటమే మంచిదనుకుంది. జనాన్ని తోసుకుంటూ గోపాలాన్ని ఎడం చేత్తో పట్టుకుని గంగమెట్లు దిగుతూ "మూట పట్టుకు నువ్వు బయట వుండరా... స్నానం చేసి వస్తానిప్పుడే" అంది. గట్టుమీదనే కూర్చున్నాడు గోపాలం "ముసలి.... స్నానం చేసి రానీ" అనుకుంటూ.

చూస్తుండగానే అమ్మమ్మ మెట్లు దిగిపోతూంది. నీళ్ళు నడుంలోతు వచ్చినా యింకా దిగుతూనే వుంది. కంఠం లోతు నీళ్ళు వచ్చేటప్పటికి అమ్మమ్మ గోపాలం వంక తిరిగి "నాయనా... పోతున్నారా" అంటూ అక్కడినుంచే కేకపెట్టి బుడుంగుమని మునిగింది. గోపాలం కంగారుపడి "పాప క్షయార్థం గంగా స్నానానికిపోతే వంశ క్షయార్థం ముసలీడ్చుకు పోయిందంటే యిదే కాబోలు భగవంతుడా" అనుకున్నాడు. ఆలస్యం చేస్తే అమ్మమ్మ దక్కదని "అమ్మమ్మా" అంటూ అరుచుకుంటూ మూట చేతిలో పెట్టుకుని మెట్ల మీద గుండా పరుగెత్తాడు. "అమ్మమ్మా... అమ్మమ్మా" అంటూ కేకలు పెడితే వినపించుకోనివాళ్ళు వీడి హడావుడి చూచి "క్యాహోగయా..." అంటూ పరామర్శించారు. గోపాలం అమ్మమ్మ మునిగిన చోటు చూపించి "బుడ్డీ.... డూబ్...

డూబ్..." అన్నాడు. హిందీలో గోపాలం నేర్చుకున్న మాటలు రెండు సమయానికి వుపయోగించినాయి. మునిల్లి మునిగిపోతోందని అభిప్రాయపడ్డవాళ్ళు గోపాలం చూపించినచోట తేలుతున్న తెల్లబట్ట చూడడంతోనే గభాలున నీటిలోకి దూకి అటువైపుకి యీదారు. బట్ట కనపడుతున్న చోట మునిగి అమ్మమ్మ కాబట్టి జుట్టుపట్టుకునే వీలుకాక, నడుం పట్టుకు పైకి లాక్కొచ్చి పడేశారు. కొన వూపిరి యింకా చప్పుడు చేస్తునే వుంది. ప్రథమ చికిత్స నేర్చుకుంటున్న వక విద్యార్థి అటువైపుకి వచ్చి అమ్మమ్మ మీద తన మొదటి పాఠం ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టకపోయినా అంతపనీ చేశాడు. కొన వూపిరి ఎగశ్వాసగా మారింది. పది మంది వచ్చి ఎలాగయితేనేం ఆ విద్యార్థి నుంచి అమ్మమ్మను వదిలించారు. బతికున్న వాళ్ళని అన్యాయంగా హత్య చెయ్యవద్దని విద్యార్థికి గట్టిగా చివాట్లుపెట్టి మరీ సాగనంపారు. గోపాలం యింక లాభం లేదనుకున్నాడు. సూటిగా వక బండీ మాట్లాడాడు స్టేషనుకి. యిక్కడ వుంటే యింకా ఎన్ని అఘాయిత్యాలు చేస్తుందో! ఇప్పటికి గాని గోపాలానికి తెలియలేదు, అమ్మమ్మ గుళ్ళో కోరుకునే కూలబడిందని.

రైలు బండి మళ్ళీ సొంతవూరు చేరుకునేటప్పటికి అమ్మమ్మ ప్రాణం పోయినంత పనయింది. బండిలో నుంచి అమ్మమ్మను బలవంతంగా ఇద్దరు పట్టుకుదించారు. యిప్పుడు శ్వాస అసలు ఆడటం లేదు. గాభరాపడి స్టేషను డాక్టరును పిలిపించుకు వచ్చాడు. డాక్టరు పరీక్షయింది. ఏం చెప్పమంటారు? అమ్మమ్మ టపాకట్టింది. ఆస్థికి వారసుడు కాబట్టి "అమ్మమ్మా!" అంటూ చుట్టుపక్కల నలుగు రయిదుగురు వినేటట్లు కొద్దిగా ఏడ్చాడు. వీళ్ళు వస్తున్నారని తెలిసి స్టేషనుకు వచ్చిన గోపాలం అన్నయ్య గేటు దగ్గర వుండటం చూచి అక్కడికి పరుగెత్తాడు గోపాలం. అన్నయ్య ఆదుర్దాగా "వరేయి గోపాలం నీకు కూతురు పుట్టిందిరా...అచ్చంగా అమ్మమ్మ పోలికే... ముక్కూ అదీను" అన్నాడు. గోపాలం బిక్కముఖం పెట్టి "అమ్మమ్మ చచ్చిపోయింది". అన్నాడు. ఎరుగున్న టిక్కట్టు కలెక్టరు అందుకుని "కాశీలో నన్నాపోతే జన్మ రాహిత్యం అయ్యేదిగా...ఈ వూళ్లోనే పోయి మళ్ళీ మీ యింట్లోనే పుట్టిందిరా... ఉట్టికెక్క లేనమ్మ స్వర్గానికి ఎక్కడ వెళ్ళుతుంది" అన్నాడు. "ఆ ... ఉట్టి కెక్కగలిగితే అంతకంటె స్వర్గం ఎక్కడ వుంది... దాంట్లోనే వుంటుంది" అన్నాడు టికెట్లవాడు. "బాగాచెప్పాడు... ఇల్లు సరిదిద్దు కుంటే యింకేం కావాలి... సరైన యిల్లుంటే అదే స్వర్గం" అన్నాడు గోపాలం అన్నయ్య. గోపాలం మాట్లాడే స్థితిలో లేడు. "అమ్మమ్మా" అంటూ ఆయాసంగా అమ్మమ్మ వైపుకి వెళ్ళాడు. అమ్మమ్మ కదులుతోంది కొద్దిగా; గోపాలం ఆశ్చర్యానికి అంతులేదు. "అమ్మమ్మా...అమ్మమ్మా..." అంటూ అదే పనిగా ఆవేదన వెలిబుచ్చుతున్నాడు. అమ్మమ్మ బలంగా పెదిమలు కదిలిస్తూ "నా మూటెక్కడ వుందిరా" అంది. డాక్టరు స్టెతోస్కోపు రైలుపట్టాల మీదకి పారేసి... "నేనింక వైద్యం చెయ్యను" అని ప్రమాణం తీసుకున్నాడు.

ప్రజామత, 25-9-1955.